క్లుప్తంగా

కోరం లేక సమావేశం వాయిదా

ఎల్కతుర్తి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మేకల స్వప్న అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కేవలం ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. సరైన కోరం లేకపోవడంతో సభను వాయిదా వేసినట్లు ఎంపీపీ ప్రకటించారు. అంతకుముందు ఆమె మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే సంబధిత అధికారులకు తెలియజేయాలన్నారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ కమిటీ



అధ్యక్షకార్యదర్శులు భిక్షపతి, లక్ష్మీనారాయణ

దామెర : మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పైండ్ల భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా కడారి లక్ష్మీనారాయణ, కోశాధికారిగా గొగ్గూర ప్రసాద్, ఉపాధ్యక్షులుగా గ్యాస్ మహేందర్, సార గణేష్, సంయుక్త కార్యదర్శులుగా పురుం శ్రీనివాస్, మాడిశెట్టి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా కొత్తపెల్లి కిషన్, వేల్పుల మహేష్, కొత్తపెల్లి గణేష్, కమిటీ సభ్యులుగా బొద్దు రాజయ్య, చెల్పూరి రాజు, గొగ్గూర రవీందర్, మంతెన హరికోటి, ఎలుగోయ సునిల్ తదితరులను ఎన్నుకున్నారు.

రెడ్డి సంఘం నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్ష,కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, పాపిరెడ్డి


కమలాపూర్: రెడ్డి సంఘం కమలాపూర్ పట్టణ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఊకంటి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పల్లె బక్కిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పింగిలి పాపిరెడ్డి, సహాయ కార్యదర్శిగా కట్కూరి కిషన్‌రెడ్డి, కోశాధికారిగా పెండ్యాల రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లుగా చల్లా సుధాకర్ రెడ్డి, పెండ్యాల వెంకట్‌రెడ్డి, పెండ్యాల ఆదిరెడ్డి, పల్లె కొమురారెడ్డి ఎన్నికయ్యారు.

జామాయిల్ తోట దగ్ధం



ఆత్మకూరు : ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి జామాయిల్ తోట దగ్ధమైన సంఘటన బుధవారం మండలంలోని తిరుమలగిరి శివారులో చోటు చేసుకుంది. తిరుమలగిరికి చెందిన బూర పద్మకు సంబంధించిన రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న జామాయిల్ తోట విద్యుత్ తీగల కారణంగా కాలిపోయిందని, తమకు రూ.5 లక్షల వరకు పంట నష్టం జరిగిందని బాధితురాలు పద్మ వాపోయింది.

ఆర్థిక సాయం అందజేత



ఎల్కతుర్తి: మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజమౌళి ఇటీవలే మృతి చెందగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు తంగళ్లపల్లి రమేష్ బుధవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేయడంతో పాటు ఆర్థికసాయం అందజేశారు. సంపత్, శ్రీనివాస్, గంగాధర్, బాబు, రవి, మొగిళి, శంకర్ నారాయణ తదితరలు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు : మండలంలోని కొత్తగట్టు శివారులోని ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొత్తగట్టు మాజీ సర్పంచ్ బొల్ల నరేష్ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ 168 సర్వే నంబర్‌లో హరిత హారంలో భాగంగా మొక్కలు నాటగా చలమల మహేందర్‌రెడ్డి, నగేష్‌లు జేసీబీతో మొక్కలు ధ్వంసం చేసి భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ భూ మిలో క్రషర్ పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు.

ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు

- సగంలోనే నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణం
- 2019లో శంకుస్థాపన
- రైతుల్లో ఏకాభిప్రాయం లేక పనులు వదిలేసిన కాంట్రాక్టర్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ధర్మసాగర్: ఏళ్ల గడుస్తున్నా పూర్తికాని బీటీ రోడ్డు నిర్మాణం పనులు సగంలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని పత్తిబండ శివారు నుంచి దేవునూర్ వరకు వయా వడ్డెగూడెం, రేపాకపల్లి మీదుగా సుమారు 7 కిలోమీటర్లు నూతన బీటీ నిర్మాణం చేయడానికి నాలుగున్నరేళ్ల క్రితం నాటి ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో సీఆర్‌ఆర్ నిధుల నుంచి రూ.9 కోట్లు మంజూరు చేయగా ఆగస్టు 27, 2019 సంవత్సరంలో నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించినప్పటికీ అది పూర్తి చేయని దుస్థితి నెలకొంది. పత్తిబండ శివారులో రోడ్డు పనులు చేపడుతున్న క్రమంలో స్థానిక రైతులు అడ్డంకులు సృష్టించడంతో కాంట్రాక్టర్ ముందుగా రేపాకపల్లి నుంచి దేవునూర్ వరకు రెండు నూతన వంతెన(బ్రిడ్జి)లు నిర్మాణం చేసి రోడ్డు పనులు పూర్తి చేశాడు. అనంతరం వడ్డెగూడెం బోడు వద్ద నుంచి రేపాకపల్లి వరకు కొంత మేర రోడ్డు పనులు చేపట్టారు. అయితే నాలుగున్నరేళ్ల గడుస్తున్నా పత్తిబండ శివారు నుంచి వడ్డెగూడెం వరకు రోడ్డు నిర్మాణానికి కావాల్సిన భూమి ఇవ్వడానికి రైతుల్లో ఏకాభిప్రాయం లేక కాంట్రాక్టర్లు పనులు చేపట్టకుండా వదిలేశారు. దాదాపై 5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేశారు. రెండు కిలోమీటర్లు పూర్తి చేస్తే ప్రజలకు ఆ రోడ్డు ఉపయోగపడుతుంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో రేపాకపల్లి, వడ్డెగూడెం ప్రజలు ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. ఇక వర్షం పడితే అంతే సంగతులు కాలు తీసి వేయలేని పరిస్థితి. ఆయా గ్రామాల ప్రజలు ధర్మసాగర్‌కు వివిధ పనుల నిమిత్తం వెళ్లాలంటే ఉనికిచర్ల మీదుగా దాదాపు 8 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు పనులు పూర్తి చేస్తే కేవలం 4 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. అదేవిధంగా ఆ రోడ్డుకు ఇరువైపుల ఉన్న రైతులు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండలంలోని వివిధ గ్రామాలను అనుసంధానం చేస్తూ అంతర్గత బీటీ రోడ్ల నిర్మాణం చేయించారు. ఈ క్రమంలోనే ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని పత్తిబండ శివారు నుంచి దేవునూర్ వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. కాగా రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. ఈ విషయంలో కడియం శ్రీహరి ప్రత్యేకంగా దృష్టి సారించి రైతులతో చర్చించి రోడ్డు పనులు పూర్తి చేసే విధంగా చూడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



శంకుస్థాపనకు వేసిన శిలాఫలకం



అర్ధంతరంగా నిలిచిన రోడ్డు

రైతుల సహకారం లేకనే పనులు నిలిచాయి

పత్తిబండ శివారు నుంచి వడ్డేగూడెం వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న రైతుల సహకారం లేకపోవడంతో పనులు నిలిపివేశాం. ముందుగా ఫార్మేషన్ పనులు ప్రారంభించగా ఆ ప్రాంత రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఆర్ఆర్ నిధులు మంజూరి చేసి శంకుస్థాపన చేసిన తేదీ నుంచి 18 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ 36 నెలలు వేచి చూసినప్పటికి ఆ ప్రాంత రైతులు పనులు చేపట్టకుండా అడ్డుకున్నారు. పనులు చేపట్టాలంటే నూతనంగా నిధులు మంజూరు చేయించాల్సి ఉంటుంది.

– దేశినేని హన్మంతరావు, కాంట్రాక్టర్



దేవునూరులో నిర్మించిన బ్రిడ్జి



రేపాకపల్లి వద్ద నిర్మించిన బీటీ రోడ్డు



వడ్డెగూడెం శివారులోని రోడ్డు

తొమ్మిదైనా బడికి రాని టీచర్లు

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక విద్యా వలంటర్ విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటలు కావస్తున్నా ఒక్కరూ కూడా ఉపాధ్యాయులు పాఠశాలకు రాలేదు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ ఆయా పాఠశాలకు వచ్చిన విద్యార్థులను తరగతి గదిలో కూర్చోబెడుతుంది. ఎవరైనా విద్యార్థులు తల్లిదండ్రులు అడిగితే సార్లు పది నిమిషాల్లో వస్తారంట అంటూ సమాధానం చెబుతుంది. ఒంటిపూట బడి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఉపాధ్యాయులే గంటకు పైగా ఆలస్యంగా వస్తే విద్యార్థులకు ఏం బోధన చేస్తారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరును పరిశీలిస్తుండగా, ఇక్కడ లేకపోవడంతో చాలా చోట్ల ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తాలేరనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఉపాధ్యాయులు లేక ఖాళీగా కూర్చున్న విద్యార్థులు

విధి నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలి



పరకాల : విద్యుత్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీఈ దేవేందర్‌నాయక్



శాయంపేట : ప్రతిజ్ఞ చేయిస్తున్న దేవేందర్ నాయక్

పరకాల: విధి నిర్వహణలో భద్రత జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామాల్లో సింగిల్ ఫేజ్ నియంత్రికల్లో ఎలాంటి ఎర్తింగ్ సమస్యలు తలెత్తకుండా ఎర్తింగ్‌ల వద్ద నీటిని నింపాలని పరకాల ఏడీఈ దేవేందర్ నాయక్ ఆదేశించారు. పట్టణంలోని అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలో ఆయన విద్యుత్ అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించిన అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. తన కుటుంబ వయస్సులతో పాటు సంస్థ అభివృద్ధికి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఈ జి.సత్యనారాయణ, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, లైన్ ఇన్స్‌పెక్టర్స్, లైన్‌మెన్‌లు, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ప్రతి ఉద్యోగి భద్రత నియమాలను పాటించాలని విద్యుత్ శాఖ ఏడీఈ దేవేందర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ సిబ్బంది చేత భద్రత నియమాల పై ప్రతిజ్ఞ చేయించారు. విద్యుత్ సిబ్బంది విధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మకూరు: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్ సిబ్బంది

విధులపై అప్రమత్తంగా ఉండాలి

శాయంపేట : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలు జరగకుండా, ప్రాణనష్టం సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏడీఏ దేవేందర్‌నాయక్ అన్నారు. శాయంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బందికి, ఉద్యోగులకు విధులపై తగు జాగ్రత్తలు, విద్యుత్ ప్రమాదాల గురించి వివరించారు. అనంతరం సిబ్బందితో భద్రత, సురక్షితపై ప్రతిజ్ఞ చే యించారు. కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, లైన్‌మెన్ సంతోష్, జేఎల్ఎం విష్ణు, సిబ్బంది పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

శాయంపేట : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మదీనా మజీదులో బుధవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. ముందుగా మతగురువు అబ్దుల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, నాయకులు చిందం రవి, బా సని మార్కండేయ, మా రెపల్లి రవీందర్, నిమ్మల రమేష్, కొమ్ముల భాస్కర్, సుదర్శన్, రాజు, రాజేందర్, కట్టయ్య, శ్రీనివాస్, రవిపాల్, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు

రూ.500 బోనస్ ప్రకటించాలి

శాయంపేట : రైతులు పండించిన వరి ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ప్రకటించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులు బ్యాంకులలో రూ.రెండు లక్షల రుణాలను తీసుకోవాలని అధికారం చేపట్టగానే డిసెంబర్ 9న తెచ్చుకున్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అధికారం చేపట్టిన కూడా ఇప్పటి వరకు రుణమాఫీ చేయకుండా రైతులను బ్యాంకు చుట్టూ తిప్పుకుంటున్నారని మండిపడ్డారు. రైతుబంధు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అహంకారంతో మాట్లాడాడని అదే తరహాలో కాంగ్రెస్ నాయకులు కూడా మాట్లాడుతున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రైతులే తగిన బుద్ధి చెబుతారని రామకృష్ణ తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి



ఆత్మకూరు : శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీఐ క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని నీరుకుళ్లలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై రాజేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యను కలిసిన నాయకులు

వేలేరు : కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో గ్రామశాఖ యూత్ అధ్యక్షుడు భరత్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సలీం మాలిక్, బైరి అనిల్, మహేందర్, శ్రీకాంత్, నరేష్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

ఆత్మకూరు : ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఆత్మకూరు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నిర్మలకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పార్వతి పదవీ విరమణ పొందిన సందర్భంగా బుధవారం ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల కుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందినప్పటికీ సమాజ సేవలో ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు పుష్పలత, రజిత, కిరణ్, చిలుకమ్మ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



పార్వతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు



పరకాల : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్

పరకాల : వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికే చలివేంద్రాల ఏర్పాటు అని పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ అన్నారు. వేసవిలో దృష్టిలో ఉంచుకొని బుధవారం పరకాల పోలీసుల ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలో నీరు ఎక్కువగా తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అందుకే పరకాల బస్టాండ్‌లో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ రవిరాజు, ఎస్సై రమేష్, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, దేవేందర్, రవీందర్, పాల్గొన్నారు.

శివాజీ యువసేన ఆధ్వర్యంలో..

శివాజీ యువసేన ఆధ్వర్యంలో పరకాల కూరగాయల మార్కెట్ వద్ద చలివేంద్రాన్ని 21వ వార్డు కౌన్సిలర్ ఆర్‌పీ జయంత్‌లాల్ ప్రారంభించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా శివాజీ యువసేన ప్రతి ఏడాది వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు గోపు రాజేందర్, సదానందం, మాచర్ల లింగమూర్తి, ఈశ్వర్, రమేష్, శివాజీ యువసేన నాయకులు రాజేష్, రాజ్‌కుమార్, అర్జున్, వంశీ, దినేష్, మహేందర్, అశోక్, ఆనంద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



వేలేరు: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి రవికుమార్

వేలేరు : వేలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89 పదో తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి రవికుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండతీవ్రత అధికంగా ఉండటంతో బాటసారులు, ప్రయాణికుల సౌకర్యార్థ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన విద్యార్థులను అభినందించారు.

కోతులు, కుక్కల బారి నుంచి కాపాడాలి

- రోడ్డు వెంట నడవాలంటే జంకుతున్న ప్రజలు
- గాయపడిన వారికి ఏఆర్ వ్యాక్సిన్లు వేసిన పీహెచ్‌సీ సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రంలో కోతులు, కుక్కలు వీరంగం చేస్తున్నాయి. నియంత్రణ లేకపోవడంతో వాటి బెడద ఎక్కువగా ఉంది. కోతుల నివారణకు గత ప్రభుత్వం మంకీ ఫుడ్ కోర్టు నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎక్కడ కూడా అమలుకు నోచుకోలేదు. కోతులకు ఆహారం దొరక్కపోవడంతో ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. రోడ్లపై పండ్లు, ఆహార పదార్థాలను తీసుకొని వెళ్లే వారి వెంటపడి వాటిని గుంజుకుంటూ వారిని గాయపరుస్తున్నాయి. కుక్కలు రోడ్లపై గుంపులు గుంపులుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాల బారినపడుతున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు పంపిణీ చేస్తుండగా శాయంపేట పీహెచ్‌సీలో మార్చి నెలలో కోతుల బారిన పడి గాయపడిన 32 మందికి, కుక్కల దాడిలో గాయపడిన 25 మంది బాధితులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌లు ఇచ్చినట్లు పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ తెలిపారు. శాయంపేటలోని ప్రజలకు అత్యధికంగా ఏఆర్ వ్యాక్సిన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి కోతుల, కుక్కల బెడద నుండి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కోతి గాయపర్చిన మహిళకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యురాలు

గురువుల బోధనలు అనుసరించాలి



బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ బాబు

కమలాపూర్: విద్యార్థులు గురువుల బోధనలు, మార్గదర్శకాలను అనుసరిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీడీఓ గుండె బాబు అన్నారు. మండల కేంద్రంలోని టాకీస్ ఏరియా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం, ఐదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. అనంతరం సంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీఓ బాబు మాట్లాడుతూ ప్రాథమిక విద్య చాలా పటిష్టమైందన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు రాజ మల్లయ్య, పీడ బ్ల్యూసీ పవన్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, ఫిజియోథెరపీ డాక్టర్ నాగవంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు

గీసుకొండ : మండలంలోని మనుగొండ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ రడం శ్రావ్య భర్త, బీఆర్ఎస్ నాయకుడు భరత్‌పై ఎన్నికల సంఘం అధికారి డాక్టర్ కె.నారాయణ ఫిర్యాదు మేరకు పరకాల సీఐ రవి రాజ్ కేసు నమోదు చేశారు. భరత్ గతంలో కాంగ్రెస్ గీసుకొండ మండల అధ్యక్షుడిగా వ్యవహరించారు. కొండా మురళి వర్గం నాయకుడిగా ఆయనకు పేరుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన తన భార్యతో కలిసి అప్పటి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం పరకాల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలుపొందారు. కాంగ్రెస్ అధి కారంలోకి వచ్చిన తర్వాత భరత్ తన వర్గీయులతో కలిసి మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ నెల 7న కోటగండి సమీపంలోని పీడీఆర్ గార్డెన్‌లో సుమారు 500 మందితో కలిసి కొండా మురళి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకుల సమావేశాన్ని నిర్వహించడానికి పోలీసులు, ఎన్నికల అధికారుల నుంచి అనుమతి తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, భరత్ బీఆర్‌ఎస్ నాయకుడని, మండలంలోని కాంగ్రెస్ శ్రేణుల మధ్య అయోమయాన్ని నెలకొల్పడానికే ఇదంతా చేస్తున్నాడని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గార్డెన్‌లో నిర్వహించే సమావేశానికి అనుమతి ఇవ్వకపోవడమే కాకుండా బీఆర్‌ఎస్‌లో ఉండి కాంగ్రెస్ నాయకుడిగా ప్రచారం చేసుకుంటున్నాడని భరత్‌పై కేసు నమోదు చేశారు.